క్లుప్తంగా

ఇన్‌స్పైర్ అవార్డుకు ముగ్గురు కొట్టక్కి బాలికలు



ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైన బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు

రామభద్రపురం: మండలంలో కొట్టక్కి పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం రావాడ భాస్కరరావు తెలిపారు. మల్టీ పర్పస్ ల్యాండ్ అప్రోచ్, స్మార్ట్ రోడ్ సిస్టం, విండ్ టర్బో ఏరో డైనమిక్ వెహికల్ తదితర ప్రాజెక్టుల్లో ప్రతిభ కనబరిచిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు వంగపండు శ్రీ గ్రీష్మ, పాశల ధరణి, బయ్యపు సింధుజ, గైడ్ టీచర్ షరీఫ్‌ను హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

శక్తి యాప్‌పై అవగాహన

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే జంక్షన్‌ల వద్ద ఎస్‌ఐ వి.జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలు, యువతులు, బాలికలు, విద్యార్థినులకు శక్తి యాప్, దాని వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం ఆ యాప్‌ను వారి స్మార్ట్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయించారు. ఆపదలో ఉన్నప్పుడు ఈ యాప్‌ను ఆశ్రయిస్తే భద్రత దక్కుతుందని ఎస్‌ఐ తెలిపారు.

ఆరికతోటలో సీఐ పల్లెనిద్ర



పల్లెనిద్ర చేస్తున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ కె.నారాయణరావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరికతోటలో సీఐ పల్లెనిద్ర చేసి, ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలపై గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లు రావడం, లాటరీ తగిలిందని, మీ అకౌంట్ నంబర్ చెప్పండని, లింక్ ఓపెన్ చేయండని చెప్పడం, మీకు బహుమతి వచ్చిందని, మీరు లక్షాధికారులు అవుతారని చెబితే నమ్మవద్దని, వారడిగిన వివరాలు ఇవ్వవద్దన్నారు. అనంతరం రాత్రి పల్లె నిద్రకు సీఐ ఉపక్రమించారు.

మద్యంసీసాలు స్వాధీనం

రామభద్రపురం: మండల కేంద్రంలోని రాజాం రూట్‌లో అక్రమంగా తరలిస్తున్న 50 మద్యం సీసాలను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, బాడంగి మండలం, పిన్నవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వి.ప్రసాదరావు పేర్కొన్నారు. మద్యం బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా నేరమని, ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవినీతి జరుగుతుంటే ఏం చేస్తున్నారు?

బొబ్బిలి: రెవెన్యూ, మున్సిపల్ శాఖల్లో అవినీతి జరిగితే సహించబోనని సీఎం చంద్రబాబు చెప్పారని, ఇప్పుడు ఆయా శాఖల్లో ఎక్కడపడితే అక్కడే అధికారులు లంచాలు తీసుకుంటుంటే, అవినీతి జరుగుతుంటే ఏం చేస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా అలజంగి గ్రామానికి వెళ్లినప్పుడు రైతు ఆత్మహత్యలు ఏ విధంగా జరుగుతాయో రుజువు చేసే ఘటన జరిగిందన్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వారసులకు భూమి పంచేందుకు, వాటిని ఆన్‌లైన్ చేసేందుకు రెవెన్యూ సిబ్బంది రూ.లక్ష లంచం అడిగారని రైతులే తమకు తెలియజేశారన్నారు. సమావేశంలో రైతు సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఎస్.గోపాలం, రెడ్డి త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

యోగా తరగతులు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో విద్యార్థులకు ఉచిత ధ్యాన యోగా తరగతులు శనివారం నిర్వహించారు. ప్రతీ విద్యార్థి ప్రతిరోజూ ధ్యానం చేసుకోవాలని, ధ్యానం చేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



బ్రీత్ ఎనలైజర్‌తో వాహనదారుడిని పరీక్షిస్తున్న పోలీసులు

వంగర: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఎస్‌ఐ షేక్‌శంకర్ శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలతో.. సతమతం

- పంచాయతీ కార్యదర్శులపై కూటమి సర్వేల కత్తి
- టార్గెట్‌లు, పనిభారంతో తీవ్రమైన ఒత్తిడిలో ఉద్యోగులు
- శాఖల మధ్య సమన్వయలోపమే కారణం
- గతంలో వలంటీర్ వ్యవస్థతో మేలు చేసిన వైఎస్సార్ సీపీ



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు (ఫైల్)

సకాలంలో సర్వేలు పూర్తి చేయాలి..

పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో చేస్తున్న సర్వేలను సకాలంలో పూర్తిచేయాలి. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పీ–4 సర్వే పూర్తి చేసి, గ్రామసభకు సిద్ధం కావాలి.

–వి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, రాజాం

రాజాం సిటీ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనాలోచిత చర్యలు, నిర్ణయాలకు గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు మానసిక వేదన, తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం సర్వేల కత్తి పెట్టడంతో రోజురోజుకూ కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు పనిభారం బాగా పెరిగిపోతోంది. దీంతో ఏం చేయాలో తెలియక దయనీయ స్థితిలో ఉద్యోగులు కాలం వెల్లదీస్తున్నారు. ప్రతిరోజూ సర్వేలకే సమయం సరిపోవడంతో పెండింగ్ పనులు చేయలేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం చేపడుతున్న సర్వేలన్నీ కత్తిమీద సాములా తయారవ్వడమే దీనికి ప్రధాన కారణమని వాపోతున్నారు. అటు ఉన్నతాధికారుల మాట కాదనలేక, ఇటు కిందిస్థాయి ఉద్యోగులకు పనులు చెప్పలేక అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. ప్రస్తుతం చేస్తున్న పీ–4 సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే(18 నుంచి 55 ఏళ్ల వయసు లోపు వారి వివరాల సేకరణ)తో పాటు ఎంఎస్‌ఎంఈవో సర్వే, హౌస్‌హోల్డ్ జియోట్యాగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ, పీఏసీఎస్ ఈకేవైసీ, డెత్ రీవెరిఫికేషన్, 0–6 ఏళ్ల వయసు పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, ఇంటి పన్నులు వంటి సర్వేలను సదరు ఉద్యోగులకు ప్రభుత్వం అప్పగించింది. దీంతో పాటు ఆయా సర్వేలు ఫలానా సమయంలోగా పూర్తి చేయాలన్న ఆదేశాలు మెడపై కత్తిలా ఉండడంతో వారంతా నిత్యం వేదన చెందుతున్నారు. ఇవేం సర్వేలురా బాబోయ్ అని మొత్తుకుంటున్నారు. ఇదిలా ఉంటే పీ–4 సర్వేపై ఈ నెల 21న గ్రామసభ నిర్వహిస్తున్నందున ఆలోగా ఆ సర్వే పూర్తి చేయాల్సి ఉంది.



పనిభారం తగ్గించాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

ఉద్యోగుల్లో సమన్వయలోపం..

గ్రామ సచివాయాలకు డీడీవోలుగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులతో కలిసి సర్వే చేయాల్సి ఉంది. అదే సమయంలో సచివాలయ ఉద్యోగులు తమ సొంత డిపార్ట్‌మెంట్ అప్పగిస్తున్న పనులు పక్కన పెట్టడంతో పాలన గాలిలో దీపంలా మారింది. ఎంతో ఉదాత్త ఆశయంతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు అందుబాటులో రాలేని పరిస్థితిలో ఉంది. డీడీవోల ఆదేశాల ప్రకారం సచివాలయ ఉద్యోగులు సర్వేలు చేస్తే సొంత డిపార్ట్‌మెంట్ అధికారుల చెప్పిన పనులు అలాగే ఉండిపోవడంతో వారితో ఛీత్కారాలు తప్పడం లేదని లోలోపల మదనపడుతున్నారు. దీనంతటికీ ఆయా శాఖల మధ్య సమన్వయలోపమే ప్రధానంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అటు అధికారులు, ఇటు ఉద్యోగుల మధ్య కూడా బేధాభిప్రాయాలు తలెత్తుతున్నాయి.

గతంలో వలంటీర్ వ్యవస్థతో మేలు..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి, వారి ఐదేళ్ల పాలనా కాలంలో ఎక్కడా ఎటువంటి లోపం జరగకుండా చూశారు. అప్పట్లో ప్రతి 50 ఇళ్లకు కేటాయించబడిన వలంటీరే ప్రభుత్వం చేయాలని ఆదేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేసేవారు. దీంతో అటు ఉద్యోగులపై పనిభారం పడేది కాదు. ప్రస్తుతం అధికారంలోకి కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టేయడంతో అసలు సమస్య మొదలైంది. వలంటీర్లే ఉంటే ఉద్యోగులపై సర్వేల భారం పడేది కాదు కదా అని అందరూ అంటున్నారు. ఇటీవల పంచాయతీ, సచివాలయ కార్యదర్శులంతా తమపై ఉన్న పని భారం తగ్గించాలని ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏ మేర ఆయా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఏది ఏమైనా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఉద్యోగులే కాకుండా ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నది వాస్తవం.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం చేపడుతున్న ప్రజాచైతన్య యాత్ర బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామానికి శనివారం చేరుకుంది. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ పార్టీ నేత పి.శంకరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల భూ సమస్యలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయని, వాటిని సకాలంలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మ్యుటేషన్లు, అడంగళ్లు, వన్‌బిల పేరుతో రైతులు తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోందని, అన్నదాతకు అన్యాయం చేయవద్దని వారికి అవసరమైన సేవలు వారికి అందేలా చూడాలన్నారు.

-బొబ్బిలిరూరల్

సారా తాగితే అధోగతి.. మానితే పురోగతి..



నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి మండలం, కొయ్యికొండవలస అనే గిరిజన గ్రామంలో సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సారా తాగితే అధోగతి.. మానితే పురోగతి.. సారా వద్దు.. ప్రాణమే ముద్దు అని నినాదాలు చేశారు. సారా తాగిన ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలు కూడా చిన్నాభిన్నమయ్యాయని ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సారా తయారీ, రవాణా చట్టరీత్యా నేరమని, ఎవరైనా సారా తయారు చేసినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

-బొబ్బిలిరూరల్

అదనపు బస్సులు నడపాలి



తెర్లాం మండలం, పెరుమాళి–సుందరాడ రూట్‌లో అదనంగా బస్సులు నడపాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ప్రకటించింది. అయితే బస్సు సర్వీసులు అంతగా లేనిచోట విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఎలా వెళ్లాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. చాలాచోట్ల సరిపడ బస్సులు లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఒక్కోసారి ఉన్న ఒక్క బస్సులోనే కిక్కిరిసి, ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు.

-తెర్లాం

పదే పదే చెప్పినా పట్టించుకోరా?

- మండల సర్వసభ్య సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులపై సభ్యుల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శంబంగి లక్ష్మి

బొబ్బిలిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్ సమస్యలను పదే పదే ప్రస్తావించినా పట్టించుకోరా అని విద్యుత్ శాఖ అధికారులను సభ్యులు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎ.వెలగవలస, కారాడ, చిత్రకోట బొడ్డవలస గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకుని, ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాల అంశాన్ని సర్పంచ్‌లు సత్యంనాయుడు, సంజీవనాయుడులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేయాలని పలుమార్లు కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలోనే ఆ శాఖ అధికారులను సమస్యల పరిష్కారానికి ఆదేశిస్తామని ఎంపీపీ సముదాయించారు. 2024 డిసెంబరులో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని పంటల బీమా సొమ్ము అందివ్వాలని గొర్లె సీతారాంపురం ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరావు కోరగా, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని కృష్ణాపురం సర్పంచ్ ఏడీ శ్యామసుందర్‌ను అడిగారు. త్వరలోనే ఇస్తామని ఆయన సమాధానమిచ్చారు. అలాగే పాడైన గొర్లె సీతారాంపురం రోడ్డు బాగు చేయాలని కోరగా, ప్రతిపాదనలు పంపామని నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని ఏఈ రాజు తెలిపారు. ఎంపీపీ జోక్యం చేసుకుని, ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం అజెండాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు శాంతకుమారి, వైస్ ఎంపీపీ శంకరరావు, ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వితరణ

రేగిడి: మండలంలోని ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రాజాం వాసవీ క్లబ్ ప్రతినిధులు అట్టలు, పెన్నులు వితరణ చేశారు. మొత్తం 38 మంది విద్యార్థులకు వాటిని శనివారం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

రాజాం సిటీ: మండలంలోని ఇప్పిలిపేట సమీపంలో ఈ నెల 14వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారని ఎస్‌ఐ వై.రవికిరణ్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఎంజేవలస గ్రామానికి చెందిన కరజాన ఆనంద్, బగ్గు రఘువర్మలు ఈ నెల 14న సాయంత్రం చీపురుపల్లి నుంచి స్వగ్రామం వస్తున్నారు. ఇప్పిలిపేట సమీపంలో రాజాం నుంచి చీపురుపల్లి వైపు వెళ్తున్న ఆటోను ఢీకొన్నారు. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న రఘువర్మతో పాటు ఆనంద్ అనే వ్యక్తి గాయపడ్డారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను రాజాం, అక్కడి నుంచి విశాఖపట్నానికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ద్విచక్ర వాహనదారుడు ఆనంద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కనీస పింఛన్ రూ.9 వేలు చేయాలి

బొబ్బిలి: ఈపీఎఫ్ కనీస పింఛన్ రూ.9 వేలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18వ తేదీన జిల్లా కేంద్రంలోని ఈపీఎఫ్ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమం చేపడుతున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్ష, ఉపాధ్యక్షులు పొట్నూరు శంకరరావు, వి.శేషగిరిరావు తెలిపారు. ఇదే విషయమై వారు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగుల వాటాగా రూ.58 వేల కోట్లకు పైగా డబ్బులు ఉన్నాయన్నారు. ఏటా రూ.22 వేల కోట్ల వడ్డీ జమ అవుతుండగా అందులో కేవలం రూ.15,140 కోట్లను మాత్రమే కనీస పింఛన్‌లో భాగంగా 78 లక్షల మందికి అందజేస్తున్నారన్నారు. మిగిలిన రూ.7 వేల కోట్లు తిరిగి పీఎఫ్ నిల్వ మొత్తంలో జమవుతోందన్నారు. ఇంత సొమ్ము కార్మికుల తరఫున జమ అవుతున్నా కేంద్రం రూ.500 నుంచి పింఛన్ ఇవ్వడం దారుణమన్నారు. ఇదే పింఛన్ పెంచాలని పలుమార్లు కోరుతున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు.

భూ సమస్యలు పరిష్కరించేదెప్పుడు?



రెవెన్యూ శాఖపై జరిగిన సమీక్షలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతున్న తహసీల్దారు సుధాకర్

బాడంగి: రైతుల భూ సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని పలువురు ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచ్‌లు రెవెన్యూ శాఖ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భోగి గౌరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖపై జరిగిన సమీక్షలో గతంలో జరిగిన భూముల రీసర్వేలో తలెత్తిన తప్పులను సరిదిద్దాలని సభ్యులంతా తహసీల్దారు కె.సుధాకర్‌ను కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దారు సమాధానమిచ్చారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై జరిగిన సమీక్షలో ఆయా శాఖల ప్రగతి నివేదికలను సంబంధిత అధికారులు చదివి, వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు, తహసీల్దారు సుధాకర్, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట శివపార్వతుల కల్యాణోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉమారామలింగేశ్వరాలయ 26వ వార్షికోత్సవం పురస్కరించుకుని, ఆలయ ధర్మకర్త సలాది వెంకటరావు ఆధ్వర్యంలో వేదపండితులు వేమకోటి గణపతిశర్మ విశేష పూజలు చేశారు. అలాగే శివాలయ ప్రాంగణంలో సూర్యనారాయణస్వామి ఆలయం, విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆరంభమైన పరీక్షలు ఆఖరి రోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలతో ముగిశాయని పరీక్ష కేంద్రం చీఫ్ విజయకుమారి తెలిపారు.

చురుగ్గా ఈకేవైసీ

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లోని రేషన్ డిపోల పరిధిలో రేషన్ కార్డుదారుల ఈకేవైసీ నమోదు చాలా చురుగ్గా జరుగుతోంది. తహసీల్దార్ హేమంత్‌కుమార్, సీడీఎస్‌డీటీ స్వర్ణలత ఆదేశాల మేరకు మండలంలోని రేషన్ డీలర్లు, సచివాలయ ఉద్యోగులంతా కలిసి కార్డుదారుల ఈకేవైసీ చేస్తున్నారు.

ఆరోగ్య తనిఖీలు

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులకు రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.ఆసిరినాయుడు సిబ్బందితో కలిసి వైద్యసేవలు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం



బొబ్బిలి సీహెచ్‌సీలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు



రాజాం: గడిముడిదాంలో ఉపాధి హామీ పనుల వద్ద స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న వేతనదారులు

వాడవాడలా స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులంతా అందమైన, ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్ కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అలాంటప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. అనంతరం గ్రామస్తులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత పలు షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిషేధిత పాలిథిన్ సంచులకు బదులు గుడ్డసంచులు వాడాలని కోరారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మి

బొబ్బిలిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ శంబంగి లక్ష్మి శనివారం ప్రారంభించారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, ఏవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.